రోడ్డుపై చెత్త వేస్తే రూ.1000 జరిమానా

బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జన్నారం, మార్చి 24 : రోడ్డు పక్కన చెత్త వారికి జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులను జన్నారం మండలంలోని పొనకల్ గ్రామంలో పలు కాలనీల్లో పంచాయతీ కార్యదర్శి రాహుల్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాటు చేశారు. ఎవరైనా చెత్తను రోడ్డు పక్కన వేసిన వారికి రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు.

వెంకటస్వామి ఆశయాలను నెరవేర్చాలి

నివాళులర్పిస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, మార్చి 24 : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి అప్పారి వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు అన్నారు. మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సంఘాన్ని బలోపేతం చేసి, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం కృషి చేసిన వెంకటస్వామిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కిరణ్, సభ్యులు బారిక్‌రావ్, వాహీద్ అలీ, రాములు తదితరులున్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత భోజనం

భోజనం చేస్తున్న పోటీ పరీక్షల అభ్యర్థులు

బెల్లంపల్లి, మార్చి 24 : బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయంలో ఆదివారం పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత భోజన కార్యక్రమం చేపట్టారు. మాజీ కౌన్సిలర్ తోడే వంశీ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం మాజీ సీడీఎస్ అధ్యక్షురాలు తోడే పద్మారెడ్డి, ఎన్ఆర్ఐ తోడే వెంకటకృష్ణారెడ్డి సహకారంతో భోజనం అందించారు. ప్రతి శని, ఆదివారాల్లో వారు ఇక్కడ భోజనం పంపిణీ చేస్తున్నారు. ప్రిపరేషన్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ఉచిత భోజన పథకాన్ని పోటీ పరీక్షల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ పీక లక్ష్మణ్, మెరుగు రామకృష్ణయాదవ్, లెంకల శ్రావణ్‌కుమార్, బుకాల రంజిత్‌కుమార్, గడ్డం మనోజ్ పాల్గొన్నారు. అమ్మ ఒడి ఎన్జీవో, టెక్నో డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలోని పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ జిల్లా బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్ల మధూకర్, సభ్యులు హన్మాండ్ల సువర్ణ, అమూల్య, హన్మాండ్ల నారాయణ, గన్నెవరం తిరుమల, రంగ సురేశ్, సిద్ధమల్ల రఘు, కాంధారి ప్రభాకర్, యూసుఫ్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ వద్ద మృతదేహం లభ్యం

ఎదులాపురం,మార్చి 24 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం తెల్లవారు జామున గుర్తించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా అతను బెజ్జూర్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన గొనే శంకర్ (56)గా గుర్తించారు. అతని బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుడి తల పగిలి రక్తస్రావం కావడంతో అనుమానాస్పద మృతిగా భావిస్తున్నట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

హైలెవల్ వంతెన నిర్మాణం ఎప్పుడో..

వేంపల్లిలో ప్రమాదకరంగా లోలెవల్ వంతెన

- నిధులు మంజూరైన ప్రారంభం కాని పనులు

హాజీపూర్, మార్చి 24 : హాజీపూర్ మండలంలోని వేంపల్లిలోని మేకల మండి పక్క నుంచి కోదండ రామాలయానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై హైలెవల్ వంతెన లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరైనప్పటికీ వంతెన ఎప్పుడు నిర్మాణమవుతుందోనని ఎదురుచూస్తున్నారు.

ప్రతి వానకాలం తిప్పలే..

వర్షా కాలంలో వాగు ఉప్పొంగితే వంతెనపై నుంచి రాకపోకలు నిలిచి పోతాయి. ఈ లోలెవల్ వంతెనను సుమారు 53 ఎండ్ల క్రితం నిర్మించారు. వంతెన కుంగడంతో నాలుగేళ్ల నుంచి వాగు ఉప్పొంగిన ప్రతిసారి మునుగుతున్నది. వంతెన మీదుగా రాకపోకలు నిలిచిపోయి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. లోలెవల్ వంతెనకు అవతలి వైపున అంగన్‌వాడీ పాఠశాల, డ్వాక్రా భవనం, వృద్ధాశ్రమం, భక్తాంజనేయ సహిత శివకేశవ ఆలయంతో పాటు ఓ ఫంక్షన్ హాలు పలు నివాస గృహాలు, రైతుల వ్యవసాయ భూములున్నాయి. ప్రతి వర్షా కాలం వాగు దాటేందుకు ఇబ్బందిపడుతున్నారు. లోలెవల్ వంతెనపై హైలెవల్ వంతెన నిర్మించాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. గత ఏడాది అక్టోబర్‌లో హైలెవల్ వంతెన నిర్మాణానికి పంచాయతీ రాజ్‌శాఖ డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి 20 లక్షల రూపాయలను కేటాయించింది. గత నవంబర్‌లో అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ వంతెన నిర్మాణం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. అదనంగా మరో 15 లక్షల రూపాయలు మంజూరైనప్పటికీ ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ రూ.35 లక్షల బిల్లులో ఎక్కడ ఆటంకాలు ఎదురవుతాయోనని పనులు ప్రారంభించేందుకు రావడం లేదని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెనను నిర్మించి, సమస్య పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్తుల ఇబ్బందులను పరిష్కరించాలి..

లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి. వంతెనకు అవతలి వైపున ఆలయంతో పాటు రైతుల పొలాలు, అంగన్‌వాడీ పాఠశాల ఉంది. గత ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణం కోసం రూ.35 లక్షల నిధులను మంజూరు చేసింది. కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నడు. వర్షాకాలానికి ముందే వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా అధికారులు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వోలపు శారద, మాజీ సర్పంచ్, వేంపల్లి గ్రామ పంచాయతీ

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్
- మందమర్రిలో సీఆర్‌పీఎఫ్, పోలీస్ బలగాల ఫ్లాగ్‌మార్చ్

మందమర్రిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రి, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని, అందుకు సబ్ డివిజన్ పోలీసులు సిద్ధంగా ఉన్నారని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం మందమర్రి పట్టణంలో సర్కిల్ పరిధిలోని పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గం బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో గల చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు కేంద్ర బలగాలతో సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా, నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎవరూ విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా బెదిరింపులకు పాల్పడినా ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో పాల్గొనే పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించరాదని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన పోలీసుల కవాతు పాలచెట్టు ఏరియా, ఒకటి, రెండు, మూడవ జోన్‌ల కార్మిక కాలనీలు, మార్కెట్, సింగరేణి పాఠశాల ఏరియా మీదుగా పోలీస్ స్టేషన్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ కే.శశీధర్ రెడ్డి, మందమర్రి ఎస్ఐ ఎస్.రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జీ.రాజశేఖర్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వైభవంగా బోనాలు..పట్నాలు

పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

చెన్నూర్ రూరల్, మార్చి 24: చెన్నూర్ మండలంలోని కత్తెరశాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రి పండుగ నుంచి ఉగాది పండగ వరకు భక్తులు మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటారని ఆలయ ఈవో రవి తెలిపారు. ప్రతి బుధవారం, ఆదివారం భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పలు సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది సాధన బోయిన గోపి, ఒగ్గు పూజారులున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

- చర్చిల్లో క్రైస్తువుల ప్రత్యేక ప్రార్థనలు

దండేపల్లిలో మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దండేపల్లి, మార్చి 24 : దండేపల్లి మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఈత మట్టలతో గ్రామంలో ప్రదర్శన చేశారు. ఏసుక్రీస్తు జెరుసలెం పట్టణ ప్రవేశ సందర్భాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవ శీలం వరప్రసాద రావు, సంఘ పెద్దలు ముద్దం సురేశ్, శ్రీనివాస్, ప్రమోద్, రవి, స్టువర్ట్, సత్యానందం, తదితరులు ఉన్నారు.

మందమర్రి పట్టణంలో..

మందమర్రి, మార్చి 24: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని చర్చీల ఆధ్వర్యంలో క్రైస్తవులు ఘనంగా మట్టల పండుగ ఘనంగా నిర్వహించారు. స్థానిక ఒకటవ జోన్‌లో గల సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టలను పట్టుకుని ర్యాలీ తీశారు. సింగరేణి పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ మార్కెట్, కార్మిక కాలనీల మీదుగా చర్చి వరకు సాగింది. పాతబస్టాండ్ ఏరియాలోని బేతెస్థ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాలతో కొబ్బరి మట్టలను పట్టుకుని యేసుక్రీస్తు కీర్తిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి పాస్టర్ జెర్మియా, బేతెస్థ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి పాతబస్టాండ్ ఏరియాలో ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

మందమర్రి : సీఎస్ఐ చర్చిలో వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

బెల్లంపల్లిలో ట్రాఫిక్ సమస్యతో సతమతం

- నిబంధనలు విరుద్ధంగా భారీ వాహనాల రాకపోకలు
- పట్టణవాసులకు ఇబ్బందులు

భారీ వాహనం ఇరుకైన దారిలోకి రావడంతో స్తంభించిన ట్రాఫిక్

బెల్లంపల్లి, మార్చి 24 : బెల్లంపల్లి పట్టణంలో భారీ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజలతో పాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు రాకపోకలు సాగించాల్సి ఉన్నా ఎవరూ పాటించడం లేదు. బజార్ ఏరియాలోని పోలీస్‌స్టేషన్ లైన్, డబ్బు సేట్ లైన్, నెల్కోలైన్, కృష్ణమందిర్ లైన్‌తో పాటు పలు లైన్‌లలో దుకాణా సముదాయాలున్నాయి. ఈ దుకాణాలకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, ఢిల్లీ తదితర నగరాల నుంచి వస్తు సామగ్రిని భారీ వాహనాల్లో ఇక్కడికి తరలిస్తుంటాయి. ఈ వాహనాలు జనంతో రద్దీగా ఉండే ఉదయం 10 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ఆ రోడ్డుపై వాహనాలన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఇటీవల భారీ వాహనం నెల్కోలైన్ దారిలో వచ్చి వెళ్తుండగా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ ఉంచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రోడ్డు పాలు..!

నెన్నెలలోని కర్జికి వెళ్లే రోడ్డుపై మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

నెన్నెల, మార్చి 24 : ఇప్పటికే గ్రామాల్లో తాగునీరు సరపడా దొరక్క ప్రజలు ఇబ్బంది పడుతుంటే నెన్నెలలో మాత్రం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ వచ్చే పైపులైన్లు నల్లాలు సక్రమంగా లేక నీళ్లు రోడ్డు పాలవుతున్నాయి. పూసవేర్ల వాడలో ఎక్కడ చూసినా నల్లాలకు బిగించిన పైపులతో పాటు ప్రధాన పైపులు పగిలిపోయి రోడ్డుపై నీళ్లన్నీ కాలువలా పారుతున్నాయి. దీంతో చివరన ఉన్న కాలనీ వాసులకు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిపోయిన నీటి పైపులను సరి చేసి నీటిని సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సింగరేణి

హోలీ వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించుకోవాలి

- సీఎండీ బలరామ్

సీఎండీ ఎన్ బలరామ్

శ్రీరాంపూర్, మార్చి 24 : ఈ నెల 25న రంగుల హోలీ పండుగను సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించుకోవాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్ బలరామ్ పిలుపునిచ్చారు. సింగరేణి ఉద్యోగులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లోనూ ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు, పర్యావరణానికి హాని కలిగించే రసాయనిక రంగులు కాకుండా సహజ సిద్ధమైన రంగులతో హోలీ వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.

అవినీతిని అరికట్టేందుకు విజిలెన్స్‌లో ఐపీఎస్‌కు బాధ్యతలివ్వాలి

- గుర్తింపు లేకుండానే అవినీతికి పాల్పడుతున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ
- నిబంధనలకు వ్యతిరేకంగా డిప్యూటేషన్ బదిలీలు
- మహిళా కార్మికులపై వేధింపులు మానుకోవాలి
- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, మార్చి 24 : సింగరేణిలో అవినీతిని అరికట్టేందుకు విజిలెన్స్ విభాగానికి సంస్థతో సంబంధంలేని ఐపీఎస్ అధికారులను కేటాయించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి రీజియన్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ అవినీతికి అడ్డాగా మారిందని, అందుకు పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్ బదిలీలు చేపడుతున్నారని, కార్మికుల నుంచి రూ.50 వేల నుంచి 2 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. జీఎం ఆఫీస్‌లో పైరవీలు చేసుకుంటూ గనులపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు కనీసం పత్రాలు రాకుండానే అధికారం చెలాయిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటేషన్ల పేరుతో అధికారులు, నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని తీవ్రంగా ఆరోపించారు. శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ అధికారులు, డీవైజీఎం, డీవైపీఎంలను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల అరాచకాలు, అవినీతిని నిర్మూలించాలన్నారు. సింగరేణిలో 1700 మహిళా ఉద్యోగులున్నారని చెప్పారు. వారిపై నాయకులు, అధికారులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఐదుగురు మహిళా ఉద్యోగులకు ఒక మహిళా సూపర్‌వైజర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు కుమ్మక్కై రోజూ ఉచిత మస్టర్లు తీసుకుంటూ తిరుగుతున్నారని ఆరోపించారు. గుర్తింపు పత్రాలు రాకుండానే ఇంత అరాచకం, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బదిలీలు పారదర్శకంగా జరగడం లేదని ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై వేధింపులు అరికట్టాలన్నారు. సింగరేణి గనులు, ఓసీపీల్లో జరిగే పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనలు ఇండస్ట్రీయల్ డిస్పూట్ కిందకు వస్తాయని పేర్కొన్నారు. నాయకులను కార్మికులను టార్గెట్ చేస్తూ అధికారులు సివిల్ పోలీస్ కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణిలోని కార్మిక సంఘాల ఐక్య వేదిక ద్వారా పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి జీవన్‌జోయెల్, శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, నాయకులు గొళ్ల సత్యనారాయణ, అశోక్, నర్సయ్య, మొగిళి, సాయి, దుర్గం లక్ష్మణ్, మొగిళయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణపై 27న సమావేశం

బెల్లంపల్లి, మార్చి 24 : బెల్లంపల్లి కన్నాల జాతీయ రహదారి-363పై ప్రమాదాలను నివారణకు ఈ నెల 27న అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. కన్నాలలోని 68 డిప్ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేస్తున్న సమావేశానికి జాతీయ రహదారుల అధికారులు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పోలీస్, రవాణా, రహదారులు, భవనాల శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలకు కళావేదిక నిర్మించాలి

మాట్లాడుతున్న కవి ముత్యబోయిన మలయశ్రీ

మంచిర్యాల ఏసీసీ, మార్చి 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలకు కళావేదిక నిర్మించాలని ప్రముఖ కవి ముత్యబోయిన మలయశ్రీ కోరారు. ఆదివారం మంచిర్యాలలోని సరస్వతీ శిశు మందిర్‌లో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు కవితలు వినిపించారు. ఈ కవి సమ్మేళనంలో బెల్లాల సుగుణాకర్, భూపతి సంతోష్, గణపురం సంతోష్, జంబోజు సత్తయ్య పాల్గొన్నారు.

కాసిపేట మండల అంబేద్కర్ సంఘం ఎన్నిక

ఎన్నికైన అంబేద్కర్ సంఘం నాయకులు

కాసిపేట, మార్చి 24 : కాసిపేట మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం కాసిపేట మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం కోర్ కమిటీ ఇన్‌చార్జి బన్న లక్ష్మణ్‌దాస్, సలహాదారులు దాగం మల్లేశ్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడిగా జాడి పోశం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దాసరి రాజయ్య, ఉపాధ్యక్షులుగా గోదార్ల శంకర్, గొడిసెల సురేందర్, దుర్గం రాంచందర్, ప్రధాన కార్యదర్శిగా రామిళ్ల కిష్టయ్య, సహాయ కార్యదర్శిగా అగ్గి స్వామి, ప్రచార కార్యదర్శిగా దుర్గం సుధాకర్, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా కొమ్ముల బాపు, మైనార్టీ సెల్ ఇన్‌చార్జిగా ముస్తఫా, బీసీ సెల్ ఇన్‌చార్జిగా పెద్దపల్లి శంకర్, సాంస్కృతిక ఇన్‌చార్జిగా గొడిసెల బాపు, సలహాదారులుగా దాగం మల్లేశ్, పల్లె మల్లయ్య, రాంటెంకి వాస్దేవ్, నస్పూరి నర్సింగ్, సిద్ధం తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, జింజిరాల తిరుపతి, శిలోజు మురళి, మద్దినేని చిన్న భీమయ్య, లంక లక్ష్మణ్, రత్నం ప్రదీప్, బోయిని తిరుపతి, వేముల కృష్ణ, అక్కెపల్లి లక్ష్మీ బుగ్గయ్య, కోర్ కమిటీ ఇన్‌చార్జిగా బన్న లక్ష్మణ్‌దాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రక్షణ చర్యల్లో విఫలమవుతున్న సింగరేణి యాజమాన్యం : టీఎన్టీయూసీ

బెల్లంపల్లి, మార్చి 24 : రక్షణ చర్యలు పాటించడంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా విఫలమైందని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి టీ.మణిరామ్‌సింగ్ ఆరోపించారు. శ్రీరాంపూర్ 1 గని ప్రమాదంలో గాయపడి కరీంనగర్ కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికుడు సాదుల సత్యనారాయణను ఆదివారం ఆయన పరామర్శించారు. సింగరేణిలో ఇటీవల జరుగుతున్న ప్రమాదాలకు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయనతో పాటు ఆ యూనియన్ నాయకులు ఏడుకొండలు, నారాయణ, చంద్రయ్య, దామోదర్‌రెడ్డి, మల్లయ్య, ముజ్జు, రాజనర్సు ఉన్నారు.

ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీతో ఉద్యోగాలు కల్పించాలి

- తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య

మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

కాసిపేట, మార్చి 24 : ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంద్ర భూమయ్య మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఆదివాసీలకు అప్పగించాలని, అడవిపై పూర్తి హక్కు ఆదివాసీలకే ఉండాలన్నారు. నీళ్లు, నిధులు. నియామకాలు పూర్తి స్థాయిలో ఆదివాసీలకే కల్పించాలని, పట్టా హక్కు కల్పించాలని, 1935లో బ్రిటిష్ ప్రభుత్వం ఆదివాసీలకు భూమి సెటిల్‌మెంట్ చేసిన పట్టాలను ఆదివాసీలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యక్షులు ఆత్రం మహేశ్, గెడం సీతారాం, నాయకులు టేకం భగవంత్‌రావు, మడావి తిరుపతి పాల్గొన్నారు.